క్లుప్తంగా

ఓటు వజ్రాయుధం



వేదాంతపురంలో ఓటు హక్కు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఓటు అవగాహన కార్యక్రమం శనివారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాల మేరకు పలు పంచాయతీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎంపీడీవో బి.అశోక్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేదాంతపురం, రామానుజపురం, నరసన్నపాలెం, సీతంపేట, సరిపెల్లి, బయ్యనగూడెం గ్రామాల్లో కళాకారులు ఓటు వజ్రాయుధం అని ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పౌరుడు దానిని వినియోగించుకోవడం బాధ్యత అని పేర్కొన్నారు.

మహానేతపై అభిమానం



చెక్కపై మహానేత శిల్పం

కొయ్యలగూడెం: అవధులు లేని అభిమానాన్ని సంపాదించుకోవడంలో మహానేత వైఎస్సార్ తరువాతే అన్నది జగమెరిగిన సత్యం. అందుకు నిదర్శనంగా కొయ్యలగూడెం వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ నూకల రాము తన అభిమానం చాటాడు. రైతు పడికట్టుకు ప్రతీకగా నిలిచే తలపాగాతో కూడిన వైఎస్సార్ చిత్రాన్ని సుమారు రూ.60 వేలతో చెక్కపై తయారు చేయించాడు. మెట్ట ప్రాంత పర్యటనకు విచ్చేయుచున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఈ చిత్రపటాన్ని కానుకగా అందిస్తామని పేర్కొన్నారు.

భక్తులతో పోటెత్తిన పారిజాతగిరి



విశేషాలంకరణలో శ్రీవేంకటేశ్వరస్వామి

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారికి ప్రీతికరమైన రోజు శనివారం కావడంతో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము 5 గంటల నుంచి సుప్రభాత సేవ, ఆరాధన, తోమాలసేవ తీర్థ ప్రసాదగోష్టి తదితర పూజలు అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఇంటర్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులుకు మామిల్లపల్లి సత్తిబాబు, భవానీ దంపతులు, గన్నమనేని వెంకట రాజేష్ అన్నప్రసాదవితరణ చేసినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.

15 మంది వలంటీర్ల రాజీనామా



ఇన్‌చార్జి ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్‌లు

కుక్కునూరు: ఎన్నికల నేపథ్యంలో చంద్రబాబు వలంటీర్‌లపై విషం కక్కుతూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మండలంలోని అమరవరం సచివాయల పరిధిలోని 15 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈమేరకు ఇన్‌చార్జి ఎంపీడీఓ పీఎస్ఎన్ నరసింహారావుకు రాజీనామా పత్రాలను అందించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులలోనూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన తమను చంద్రబాబు ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తూరు జూట్ మిల్లును తెరవాలి

ఏలూరు (టూటౌన్): చట్ట విరుద్ధంగా మూసివేసిన కొత్తూరు జూట్ మిల్లును తెరిపించాలని కోరుతూ ఇఫ్టూ అనుబంధ సంఘాలు, ఏలూరు జట్టు కార్మిక సంఘం, హమాలీ ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ సెంటర్‌లో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇఫ్టూ ఏలూరు నగర సహాయ కార్యదర్శి మంగం అప్పారావు, ఉపాధ్యక్షుడు దూళ్ళ వీరినాయుడు మాట్లాడారు. ఈనెల 8న మూసివేసిన కొత్తూరు జూట్ మిల్లును తెలిరిపించాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ లబ్ధి.. జగన్ ఘనతే

- వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సునీల్‌కుమార్ యాదవ్, విజయరాజు
- ధర్మాజీగూడెంలో ఎన్నికల ప్రచారం





ధర్మాజీగూడెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు సునీల్‌కుమార్, విజయరాజు, ఎడ్లబండిపై ఎన్నికల ప్రచారం చేస్తున్న దృశ్యం

లింగపాలెం: కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ లబ్ధి అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. శనివారం మండలంలోని ధర్మాజీగూడెం, కాటమరెడ్డిపల్లి గ్రామాల్లో వారు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వారికి పెద్ద ఎత్తున ప్రజలు, మహిళలు బాణసంచా, తీన్మార్ డప్పుల నడుమ పూలవర్షంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు మాట్లాడుతూ ప్రజాప్రభుత్వాన్ని మరోసారి స్వాగతించాలని కోరారు. ప్రస్తుత సంక్షేమ పథకాలు కొనసాగించాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి కావాలని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సీఎం జగన్‌తోనే సాధ్యమన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వం నుంచి మీ కుటుంబానికి మేలు జరిగితే తనకు ఓటు వేయమని ఒక్క జగన్‌మోహనరెడ్డి తప్ప దేశంలోని మరే నాయకుడూ ఆడగలేదన్నారు. దమ్మున్న నాయకుడు సీఎం జగనే నన్నారు. టీడీపీ కుట్రల వల్లనే ఈ నెలలో వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా చేశారన్నారు. ప్రతి ఒక్కరూ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయరాజుకు భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ధర్మాజీగూడెం సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వరప్రసాద్, మోరంపూడి జగన్, సర్పంచ్ కొత్తూరి మౌనిక, రాష్ట్ర లిడ్‌క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ఎంపీటీసీ మేకల రాజ్యలక్ష్మి, స్థానిక పార్టీ అధ్యక్షుడు మేకల రాజు, మండల బూత్ కన్వీనర్ ఉప్పలపాటి గోపి, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, జిల్లా బీసీ వైఎస్సార్ సీపీ నాయకులు గోరుముచ్చు గోపాల్‌యాదవ్, నాయకురాలు పొన్నాల అనితమ్మ, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు సూర్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్లు మండలపు సాయిబాబు, మేడవరపు అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, రంగాపురం సొసైటీ చైర్మన్ రెడ్డిన శ్రీను, మండల సచివాలయ కన్వీనర్ అన్నపనేని శాంతరావు, కోకన్వీనర్ రెడ్డి ప్రవీణ్, జెడ్పీటీసీ వద్దాని హరినాథరాజు, నాయకులు ఏపూరి సూరిబాబు, కొత్తూరు రమేష్, నూతులపాటి శ్రీను, చల్లా గంగాధరావు, రావి కొండయ్య, పేరావలి, మండలపు నరసింహరావు, కర్లపూడి ఆనంద్, బి ప్రభాకరెడ్డి, బొల్లిన సుబ్బారావు, కట్టా సత్యన్నారాయణ, పి వేమనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీరామచంద్ర విద్యాసంస్థల యాజమాన్యం



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీవేంకటేశ్వర కళాశాల యాజమాన్యం



విజయభేరి మోగించిన విద్యార్థులను అభినందిస్తున్న విద్యావికాస్ విద్యాసంస్థల యాజమాన్యం

జంగారెడ్డిగూడెం: ఇంటర్మీడియెట్ పబ్లిక పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆయా కళాశాలలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయభేరి మోగించారు. శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంపీసీ విభాగంలో ఎ.హేమగ్రేస్, ఎ.పావని, ఎ.చంద్రలేఖ, ఎ.భావన, ఎ.రోహిత్ నాయుడు, ఎ.లోహిత్, ఎస్ఎస్ఎస్ తేజ్, వి.శేష శ్రీహిత్ 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు సింగిరెడ్డి సత్యనారాయణ, కానూరి నాగేశ్వరరావు, గగ్రే శ్రీధర్ తెలిపారు. అలాగే బైపీసీ విభాగంలో పి.వర్షితసాయి, జి.దివ్యసత్యశ్రీ 440 మార్కులకుగాను 435 మార్కులు సాధించారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్‌లో 1000 మార్కులకు గాను ఎంపీసీలో ఎ.అఖిల 987, కె.అనంతలక్ష్మి 983, ఆర్.భాగ్యశ్రీ 982, ఎల్.అమూల్య 981, ఎస్.లీలపావని 980 మార్కులు, బైపీసీలో ఎం.ప్రశాంతి, ఓ. కీర్తన, పి. నాగదుర్గ 975 మార్కులు సాధించినట్లు చెప్పారు.

- విద్యావికాస్ జూనియర్‌కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఎంపీసీలో పి.దేవి 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించగా తబిల్ 464 మార్కులు, జశ్వంత్‌రెడ్డి 464 మార్కులు సాధించారని కళాశాల యాజమాన్యం పి.సతీష్‌చంద్, వి.శ్రీనివాస్ తెలిపారు. బైపీసీ విభాగంలో ఆర్.శ్రావణలక్ష్మి 434 మార్కులు, ఎంఈసీ విభాగంలో పి.హర్షిత 483 మార్కులు సాధించినట్లు చెప్పారు. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకుగాను కె.యూగిని సత్య విద్య 990 మార్కులు, ఎం.స్నేహిత 986 మార్కులు, ఎస్.నిహారిక 985 మార్కులు, బైపీసీ విభాగంలో కె.ఐశ్వర్య 989 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.
- శ్రీరామచంద్ర జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటినట్లు కళాశాల ఎండీ బీవీ కృష్ణారావు, కరస్పాండెంట్ వీవీఎస్ జగదీష్‌కుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరం సీఈసీ విభాగంలో 500 మార్కులకు గాను ఎం.ఈశ్వరి 482 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను డి.శ్రీలక్ష్మి 464 మార్కులు, కె.రాజేష్ 462 మార్కులు, వి.యామిని 461 మార్కులు, బైపీసీ విభాగంలో 440 మార్కులకు గాను ఎం.నాగశ్రీ 421 మార్కులు సాధించినట్లు చెప్పారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకుగాను ఎంపీసీ విభాగంలో వి.నిఖిలశ్రీ 979 మార్కులు, ఎస్.మోహన చంద్రిక 975 మార్కులు, బైపీసీ విభాగంలో పి.శృతి 961 మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను డైరెక్టర్ బీవీ సత్యనారాయణ, ఏవో రమేష్, అధ్యాపకులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థులనే గెలిపించండి



జంగారెడ్డిగూడెంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెట్టి గురునాధరావు, నేతల ప్రచారం

జంగారెడ్డిగూడెం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాధరావు ప్రజలను కోరారు. పట్టణంలో 21, 22 వార్డుల్లో శనివారం పార్టీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటికి, దుకాణాలకు వెళ్లి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, పట్టణ అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రానికి మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పదవిని అధిరోహించాలంటే, ఆయన బలపర్చిన ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజును గెలిపించాలన్నారు. జెట్టి గురునాధరావు మాట్లాడుతూ కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందనఅనరు. సంక్షేమంతోపాటు అభివృద్ధిని పరుగులు పెట్టించిన వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, రాష్ట్ర మహిళా సెక్రెటరీ కాసర తులసి రెడ్డి, వైస్ చైర్మన్‌లు కంచర్ల వాసవి, ముప్పిడి వీరాంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు మండవల్లి సోంబాబు, మేడవరపు విద్యాసాగర్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, ఏలూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు గెద్దాడ శ్రీనివాసరావు, స్థానిక కౌన్సిలర్ తడికిమల్ల మురళి, కంచర్ల గీత, నేకూరి కిషోర్, సంకు సురేష్, దొంతు మాధవ్, ఎల్‌వీఆర్, గోకుల పారిజాతగిరి చైర్మన్ గూడపాటి రాధాకృష్ణ, మాజీ సొసైటీ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీను, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ రాపోలు భావనఋషి, యూత్ అధ్యక్షుడు కాసర్ బస్నిరెడ్డి, కె.ప్రకాష్, బిలాల్ మసీద్ అధ్యక్షుడు షేక్ జిలాని, తదితరులు పాల్గొన్నారు.

గోటితలంబ్రాలతో భద్రాద్రికి పాదయాత్ర



గోటితో వలిచిన తలంబ్రాలతో భద్రాద్రికి పాదయాత్రగా వెళుతున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: శ్రీరామ ఆధ్యాత్మిక సేవా సమితి ఆధ్వర్యంలో గోటితలంబ్రాలతో భక్తులు జంగారెడ్డిగూడెం నుంచి భద్రాద్రికి శనివారం పాదయాత్ర ప్రారంభించారు. భద్రాచలంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి కల్యాణ వేడుకకు భక్తులు గోటితో వలిచిన తలంబ్రాలను తీసుకువెళ్లారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ పాదయాత్ర శ్రీరామ నవమి నాటికి భద్రాచలం చేరుకుంటుందని ముళ్లపూడి వీర వెంకట సత్యనారాయణ తెలిపారు. 150 గ్రామాల ప్రజలు ఈ పాదయాత్రలో పాల్గొన్నారన్నారు. 23వసారి ఈ పాదయాత్ర చేపట్టినట్లు చెప్పారు. ఈ పాదయాత్రను శ్రీసీతారామస్వామి వారి ఆలయం వద్ద చామర్తి శ్రీరాములు ప్రారంభించగా, శ్రీరామరథానికి సినీ గేయరచయిత అనంత శ్రీరాం పూజలు నిర్వహించారు. గోటితలంబ్రాల ప్రాశస్త్యం, పాదయాత్ర విశిష్టతను ఆధ్యాత్మిక వేత్త ధనకుమార్ తెలియజేశారు. జై శ్రీరాం నామంతో భక్తులు పట్టణ ప్రధాన రహదారి వెంట భద్రాచలం బయలుదేరారు. భక్తులకు అల్పాహారం, తేనీరును పట్టణ ప్రముఖులు అందజేశారు. శ్రీవల్లీ దేవసేన సహిత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ అల్పాహారం, చోడు జావ పంపిణీ చేశారు.

ఊటుకూరికి ఉగాది నంది



డాక్టర్ ఊటుకూరి వరప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: బోడిగూడెం ప్రభుత్వ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఊటుకూరి వరప్రసాద్ నంది అవార్డు అందుకున్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమండ్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి రెడ్డి చేతులమీదుగా నంది పురస్కారం అందుకున్నట్లు వరప్రసాద్ శనివారం పేర్కొన్నారు. ఏపీ ఎస్ ఎస్ఈఈఆర్టీ పాఠ్యపుస్తక రచనకు, అదేవిధంగా పలు కవితలకు, రచనలకు ఉగాది వేడుకలను పురస్కరించుకుని ఘనంగా సన్మానించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ అద్దంకి రాజయోనా, ఇతర సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



మురళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కంభం విజయరాజు, నేతలు

లింగపాలెం: ములగలంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇనుగంటి మురళి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. ఈమేరకు శనివారం పార్టీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్ తదితరులు మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు మురళి కుమారుడు, గ్రామ సర్పంచ్ ఇనుగంటి రాజేష్‌బాబును పరామర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయరాజు వెంట రంగాపురం సొసైటీ అధ్యక్షుడు రెడ్డిన శ్రీను, ఇనుగంటి సతీష్, రావి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించాలి

బుట్టాయగూడెం: డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ప్రతి మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లాకు చెందిన జడ శ్రీనివాసరావు కుటుంబంతో కలిసి జనవరి 24న తాడువాయి వచ్చాడు. శ్రీనివాసరావు, అతని కుమారుడు మహేష్‌బాబు రైతుల పొలాల్లో పొగాకు బంటా పనులు చేస్తున్నారు. మార్చి 13వ తేదీన రాత్రి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించారు. అయితే 14వ తేదీ ఉదయం లేచిచూసేసరికి మహేష్‌బాబు కనిపించలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తండ్రి శ్రీనివాసరావు కుమారుడి అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.50 వేలను విరాళంగా అందజేశారు. కొవ్వూరు మండలం మద్దూరు సొసైటీ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోట నారాయణరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు. గత పదేళ్లగా ఏడాదికి రూ.50 వేలు చొప్పున ఇప్పటివరకు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షలు జమ చేసినట్టు దాత నారాయణరావు తెలిపారు.

ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌కు అభినందనలు

కొయ్యలగూడెం: ఇటీవల విధుల్లో చేరిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్యామ్‌కుమార్‌ను రోటరీ క్లబ్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు విశ్వనాథ శర్మ, ఐటీడీఏ రిటైర్డ్ ఎంఈఓ ఎస్‌కే అమీర్ భాష, స్పందన సంస్థ అధ్యక్షుడు బొలుసు నాగేశ్వరరావు ప్రిన్సిపాల్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కళాశాల ప్రాంగణంలో సరస్వతి మాత విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు.

భద్రాచలానికి పాదయాత్ర



పాదయాత్రగా భద్రాచలం వెళుతున్న భక్తులు

టి.నరసాపురం: భద్రాచలం కోదండరాముడిని దర్శించుకోవడానికి మండలం నుంచి భక్తులు పాదయాత్రగా వెళ్లారు. బొర్రంపాలెం, తిరుమలదేవిపేట, మల్లుకుంట గ్రామాలకు చెందిన భక్తులు తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం శ్రీరామచంద్ర స్వామిని దర్శించుకొనడానికి కాలినడకన రామనామం జపిస్తూ తరలివెళ్లారు. భక్తులకు మార్గ మధ్యంలో ప్రజలు అల్పాహారం, మంచినీటి సదుపాయాలు కల్పించారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

టి.నరసాపురం: ఆలయాల వార్షికోత్సవాల సందర్భంగా బొర్రంపాలెంలోని గ్రామదేవతలకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లకు భక్తులు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. దాతలు బొమ్మగాని బాలకృష్ణ దంపతులు అమ్మవార్లకు పూజలు చేశారు. వార్షిక వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు గౌడ ఆత్మీయ కలయిక

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి గౌడ ఆత్మీయ కలయిక నిర్వహిస్తున్నట్లు జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు ఏవీ రమణమూర్తి (మానవత మూర్తి) తెలిపారు. పట్టణంలోని ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరుగుతుందని, గౌడ సంఘం సభ్యులు, గౌడ కులస్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేడు వైఎస్సార్ సీపీ ప్రచారం

కుక్కునూరు: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఆదివారం మండలంలోని తొండిపాక, ఉప్పేరు పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఆ ఆ పార్టీ మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారాజు పేర్కొన్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.